
# ఫాన్సీషాప్

## కవికొండల వెంకటరావు





"ఫాన్సీషాప్" అదో తన మనస్సు అన్నట్టు అనిపించింది మెట్లెక్కి కొట్లోకి వెళ్ళడంతోనే గఫీరన్నకు. ఒకావిడ తెల్లటి ఏంగ్లో ఇండియన్ పిల్లని ఒకావిడ నల్లటి అరవ పిల్లని కనుగొన్నాడు. ఇద్దరికీ వయస్సు ఒక్కటే. వాలకం ఒక్కటే. వొయ్యారం ఒక్కటే కానైతే ఒకామె గౌను తొడిగింది. మరొకామె చీర కట్టింది. ఆ తేడా తప్పిస్తే, జుత్తుయొక్క షాంపూ నిగునుంచి, చేతుల యొక్క గుత్తుల సొంపుదాకా, గుత్తుల సొంపు నుంచి ఎత్తునడనుల జోళ్ళదాకా ఒకటే ఫాషన్. ఇద్దరూ కవలలా అని అనిపించక మానదు. ఆ వెన్ను వట్టేలు చూచినా, ఆ పాదాలు నడుముల మీద ఆధారపడి ఉన్న ఒడుదుడుకులు చూచినా.

"గుడుగుడుకుంచం. గుండారామం, పాములపట్టం పడగా రామం, కత్తెయ్యనా అద్దెయ్యనా?" అని అన బుద్దేస్తుంది ఎలాంటి వానికైనా. అయినా ఏ మాట తిన్నంగా అడగరుగా ఆడవాళ్ళను? అందులోనూ అది ఫాన్సీషాపు! ముందుగానే వాళ్ళని పలకరించాలనే నియమం అక్కరలేదు. నీవు ఆ కొట్టులో ఉన్న ఒక బొమ్మని చూస్తూ ఉన్నట్టు, ఒకటైయో రిబ్బనో వాసెం కడుతూ ఉన్నట్టు, ఒక చైర్లో కూర్చుంటూ ఉన్నట్టు ఎన్నైనా పోకిళ్ళు పోవచ్చు. ఎంతకాలమైనా గడప వచ్చు. ఏ వస్తువూ కొనకుండా ఏమీ అనకుండా నేరుగా నీ దగ్గరకు వచ్చి, అతి పొలైట్‌గా షాహుకారు వచ్చి, "ఏం కావాలండీ తమకు?_చాలా సేపట్నుంచి వెతుకుతూ ఉన్నట్టున్నారు. మాకొట్లో లేని సరుకు ఈ ప్రపంచంలో లేదు" అని అనే పర్యంతం అక్కడే డేరా మేకులా ఉండవచ్చు.

అయితే ఆ లేడీస్ అక్కడ ఉన్నంత సేపు కొట్టు అతడు తన్ను చూసే స్థితిలో ఉండబోడు అని గ్రహించాడు కాస్సేపట్లోనే గఫీరన్న. "అబ్బ!" అన్నాడు. కొట్లోవాళ్ళందరు గఫీరన్నకేసి దృష్టి సారించారు. గఫీరన్న వో బుష్‌కోటూ ఇతడూ కతక్ మనిపించాడు అంతమందినీ.

"హల్లో గఫీర్! గుడ్‌మార్నింగ్" అన్నారు ఇద్దరు లేడీస్ కూడా! "గుడ్‌మార్నింగ్.షేవింగ్ అయిందా?" అని అడిగాడు వాళ్ళను గఫీరన్న ఏ విధమైన ఇరుకూ తన హృదయంలో లేనివానికిమల్లే. "కొన్ని గంటల ముందే అయిపోయింది" అన్నది అరవ పిల్ల నవ్వుతూ. నల్లటి ముఖము మీద ఎర్రటి 'కోరల్' 'లిప్సు' అదీ. లిప్‌స్టిక్ సొంపు లేండి అదంతా, 'తెల్లారి ఒక్క గంటే అయింది" అన్నాడు గఫీరన్న రిస్ట్‌వాచ్ చూసుకుంటూ. 'కొట్టిప్పుడెనిమిది గంటలయితేనేగాని తెరవనే రాదు మేము" అన్నాడు కొట్టన్న. "అట్లా అయితే ఒక అరగంట మనమిక్కడ వృథా వున్నాం అన్నమాట" అని రివ్వుపోయినట్టు తన గడియారం చూసుకొంది. "నేనిక్కడ 8.15 నుంచి ఉన్నాను" అన్నాడు గఫీరన్న. "నీవూ మేమూ ఒకటూరి ఈ షాపులోకి దూరి ఉండవచ్చును" అంది ఏంగ్లో ఇండియన్ లేడీ.

యుద్ధం ముగిసిపోయినా ఈ తగులాటం తనకు తప్పలేదురా బాబూ! అని ఒకింత తలపోశాడు గఫీరన్న. "ఏమిటి ఆలోచిస్తూ ఉన్నావు?" అంది అరవ పిల్ల. "ఏమీ లేదు నీది నారి బిల్లు షాహుకార్!" అని షాహుకారునుండి బిల్లు తీసుకొంటూ పదిరూపాయల నోటు తన జేబులోంచి తీసి ఇచ్చేశాడు. "ఇద్దరు ముద్దియలు థాంక్స్ చెబుతూ తిరిగి కలుసుకుంటాం గఫీర్" అంటూ వెళ్ళిపోయినారు. ఆ ఆడవాళ్ళిద్దరూ వెళ్ళిపోయినారు.

"ఆ ఆడవాళ్ళిద్దరూ మీకేమవుతారు!" అని అడిగాడు. కొట్టన్న. "ఆ ప్రశ్న వేసేకన్న మీకేం కావాలి? అని అడిగితే నాకాలం నీ కాలం మరి వృథా కాదు" అన్నాడు కొంచెం ముఖం కుంచించుకుని గొంతు చించుకొని గఫీరన్న. "సారీ! తమకు ఏం కావాలో సెలవియ్యండి. సారీ! నిలబడిపోయారు. ఈ నుంచీని' అన్నాడు అతి భయభక్తులతో

"నాకు బూట్‌లేస్ కావాలి" అని బూట్ చూపిస్తూ. "అది నరకిట్టది ఈ మెట్లెక్కుతూ ఉంటేనే పట్‌మని తెగిపోయింది" అన్నాడు కూడాను. షాహుకారు "థాంక్స్! వెరీ గ్లాడ్! మా కొట్టు మెట్లు చాలా అదృష్టం చేసుకున్నాయి. నట్టులేసులేనా తమరడుగుతున్నది?" అన్నాడు సరుకు తీస్తూ— గఫీరన్న 'అవే' అని అంది పున్నకు వంగి అమర్చుకుంటూ నేలబారు చూపు ఆ వెళ్ళిపోయిన స్త్రీరత్నాం కేసి తారాజువ్వలా వదిలాడు.

"ఎందా బాగున్నారండీ మీ బూట్సు కాలేస్" అని షాహుకార్ లేసేదాకా మేలుకోనేలేదు అతగాడు.

"మీ కొట్టుమెట్లు దిగడంలో తెగిపోకుండా ఉండాలి" అంటూ టకటకా దిగేడు. ఆ స్త్రీ రత్నాలు ఆ ధ్వని కలని కేసి తుపాకి రవ్వల్లాంటి చూపులు వదిలేరు.

దాంతో గఫీరన్న బూట్‌లేస్ అప్పుడు కొన్నదైనా పట్ పట్ కొట్టుమెట్లు పూర్తిగా దిగకుండానే గాన్‌ఫట్!

●